వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

జలవిలయంపై తాత్సారం

తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో జనజీవనం అతలాకుతలమైంది. రికార్డు స్థాయి వర్షాలతో జలవనరులు పొంగి పొర్లుతున్నాయి. అనేక ప్రాంతాల్లో ఇండ్లు జలమయ్యాయి. వరదల వల్ల పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. నివాస ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో రైలు వంతెన కొట్టుకుపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం మాత్రం సమీక్షలు, ప్రకటనలతో కాలక్షేపం చేస్తున్నది. ప్రకృతి విపత్తుపై సర్కారు స్పందనలో అనుభవ రాహిత్యమే కాదు, అలసత్వం కూడా కనిపిస్తున్నది. ఇదేదో విపక్షాలు చేస్తున్న విమర్శ కాదు. ప్రకృతి విపత్తు చుట్టుముట్టిన వేళ సర్కారు సకాలంలో ఆదుకోవడం లేదంటూ వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహమే ఇందుకు నిదర్శనం.

ఖమ్మంలో మున్నేరువాగు వంతెనపై వరద నీటిలో చిక్కుకుపోయిన బాధితులు ఉదయం నుంచి రాత్రి పది గంటల వరకు ప్రాణభయంతో మొర పెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో స్థానికులే చొరవ తీసుకొని జేసీబీ, గజ ఈతగాళ్ల సాయంతో కాపాడారు. ఖమ్మంలోనే మరోచోట రెండో అంతస్థు వరకు నీరు చేరడంతో డాబాపై చిక్కుకుపోయిన వ్యక్తులను కాపాడటంలోనూ ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపించింది. ఇంటిలోని వారు కాపాడమంటూ పెట్టిన సందేశం ప్రజల మనసు కరిగించింది కానీ ప్రభుత్వాన్ని కదిలించలేకపోయింది. సొంతంగా గజ ఈతగాళ్లను పిలిపించుకుని వారు ప్రాణాలు దక్కించుకున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లా నుంచి ఉప ముఖ్యమంత్రి సహా ముగ్గురు మంత్రులు ఉండి ఏమి లాభమని బాధితులు ప్రశ్నిస్తుండటంలో వింతేముంది! వానలతో, వరదలతో జనం అవస్థలు పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయానికి రాకుండా ఇంటినుంచే టెలి కాన్ఫరెన్స్‌ల ద్వారా అధికారులకు ఆదేశాలివ్వడంతోనే సరిపెట్టడం అనుభవరాహిత్యం మాత్రమే కాదు, బాధ్యతారాహిత్యం కూడా. సమస్యపై ప్రభుత్వానికి సరైన అవగాహన లేదని కూడా క్షేత్రస్థాయి పరిస్థితులు సూచిస్తున్నాయి. జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్రానికి సిఫారసు చేయడం వల్ల స్థానికంగా పరిస్థితుల్లో మార్పు రాదు. సర్కారు సాయం అట్టడుగు స్థాయికి చేరుకోవాలంటే పై స్థానాల్లో ఉన్నవారు ప్రత్యక్ష పర్యవేక్షణ చేయడం తప్పనిసరి. సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బందిని సమన్వయపరిచే బాధ్యత సర్కారు పెద్దలదే. అది లోపించడమే ఇప్పుడు ప్రజలకు శాపంగా మారింది. సీఎం, మంత్రులు ఒకింత ఆలస్యంగా వరద ప్రాంతాల సందర్శనకు వెళ్లినప్పుడు బాధితులు గోబ్యాక్ అంటూ తిరగబడుతున్నారు. మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావును స్థానికులు ఘెరావ్ చేయడం ప్రజాగ్రహం ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తున్నది. బాధితులు రోడ్డెక్కి ఆందోళనకు దిగితే ప్రభుత్వం లాఠీలతోనే సమాధానం చెప్పుండటం మరో వైపరీత్యం.

ఇలాంటి ప్రకృతి సంక్షోభాలు గతంలోనూ వచ్చాయి. వానలు, వరదలు ముంచెత్తినప్పుడు ఇదివరకటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ స్పందనను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వం గంటలోనే హెలికాప్టర్ పంపి బాధితులను ఆదుకున్న విషయాన్ని విశేషించి ప్రస్తావిస్తున్నారు. ప్రజలను, అధికారులను అప్రమత్తం చేసి, లోతట్టు ప్రాంతాలవారిని పోలీసుల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలను పకడ్బందీగా చేపట్టడం తెలిసిందే. అదే సమయంలో ఆపత్కాలంలో మంత్రులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమన్వయ బాధ్యతలను చూసుకునేవారు. కానీ, ఇప్పుడంతా తారుమారైంది. భారీ వర్షాలతో ముప్పు పొంచి ఉన్నట్టు ముందస్తు సమాచారమున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కావాల్సిన వేగాన్ని అందుకోలేకపోయింది. ఇంకా ఉపద్రవం పూర్తిగా తొలగిపోలేదు. మరికొద్దిరోజులు వర్షాలు పడతాయని హెచ్చరికలు వెలువడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చురుకుగా స్పందించి కేంద్ర విపత్తు సహాయక దళాలను, అవసరమైతే రక్షణ దళాలను అప్రమత్తం చేసి ప్రజలను గట్టెక్కించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

హైదరాబాద్ నగర పర్యావరణ పరిరక్షణకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 'హైడ్రా' రూపంలో తలపెట్టిన ప్రయత్నం సూత్రరీత్యా ఆహ్వానించదగినదే. అయితే ఈ కార్యక్రమానికి సంబంధించి ఇంతవరకు స్వయంగా తను చెప్పిన విషయాలనూ, ప్రభుత్వ ఉన్నతాధికారులు చెప్పినవాటినీ, హైడ్రా కమిషనర్ చెప్పినవాటినీ, ఆచరణలో జరుగుతున్నవాటినీ, హైకోర్టు వ్యాఖ్యలూ, ఉత్తర్వులనూ గమనించిన మీదట ఇందులో అర్థం కాని విషయాలు అనేకం ముందుకు వస్తున్నాయి. అవి తలెత్తటం మొదలైన తర్వాత కూడా వాటికి ప్రభుత్వం వైపు నుంచి స్పష్టత లభించటం లేదు. ఆ కారణంగా ప్రజలలో అయోమయాలు, భయాందోళనలు ఏర్పడుతున్నాయి. అందువల్ల ప్రభుత్వం వెంటనే వాటిని పరిగణనలోకి తీసుకుని అవసరమైన స్పష్టీకరణలు ఇవ్వటంతో పాటు తన కార్యక్రమానికి తగు మార్పుచేర్పులు చేయటం అవసరం.

హైడ్రా లోగుట్టు ఏమిటి?

టంకశాల అశోక్

ఇందులో అన్నింటికన్న ముందు కొట్టవస్తున్నట్టు కనిపించే విషయం ఒకటున్నది. హైదరాబాద్ వంటి సుదీర్ఘమైన చరిత్ర గల మహానగరంలో ప్రభుత్వం తలపెట్టిన ఈ కార్యక్రమం సాధారణమైనది కాదు. ముఖ్యమంత్రి స్వయంగా మాట్లాడుతూ నగర పర్యావరణ, నిర్మాణాలకు సంబంధించి ఐదు రకాల ఉల్లంఘనలు జరిగాయన్నారు. ఒకటి, చెరువులు, సరస్సుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో నిర్మాణాలు. రెండు, వాటి బఫర్ జోన్‌లో నిర్మాణాలు. మూడు, నాలాలను, పార్కులను ఆక్రమించి నిర్మాణాలు. నాలుగు, ప్రైవేటుగా పట్టాలున్నప్పటికీ అనుమతులు లేకుండా చేసిన నిర్మాణాలు. అయిదు, ప్రభుత్వ భూములలో అనుమతులు లేకుండా చేసినవి. వీటిలో ప్రస్తుతానికి మొదటి మూడింటిపై దృష్టి పెడుతున్నామని అన్నారాయన. అదేవిధంగా హైడ్రా ప్రస్తుత పరిధి ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వరకని చెప్పారు. ఈ పరిరక్షణలు జరగనందువల్ల కలుగుతూ వస్తున్న రకరకాల నష్టాలు ఏమిటో, అభివృద్ధి రీత్యా మును ముందు కలగగల నష్టాలు ఏమిటో వివరించారు. అందువల్ల నగర వర్తమానం కోసం, భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలు తప్పవని ప్రకటించారు.

ఆ విధంగా ఇది సాధారణ కార్యక్రమం కాదు. బృహత్తరమైనది. అటువంటపుడు దాని అమలుకు రూపొందించే ప్రణాళిక కూడా బృహత్తరంగా ఉండాలి. అందుకు సంబంధించిన సమస్త కోణాల గురించి ముందుగానే ఆలోచించి వాటిని పరిగణనలోకి తీసుకోవాలి. వాటి మంచి చెడులు, పరిధులు, అమలు కోసం ముసాయిదా ప్రణాళికలు, ఎదురవగల చిక్కులను పరిశీలిస్తూ, అందుకు పరిష్కారాలపై ఒకవైపు అధికారుల స్థా యిలో, మరొకవైపు బయటి నిపుణులు, అనుభవజ్ఞుల స్థాయిలో విస్తృతంగా సంప్రదింపులు జరపాలి. అప్పుడు కార్యాచరణకు ఒక నిర్దిష్టమైన, స మగ్రమైన రూపం ఇచ్చి ఆచరణకు పూనుకోవాలి. అంతచేసినా కొన్ని లోటుపాట్లు, సమస్యలు ఎదురుకావచ్చు గాక. అది ఏ విషయంలోనైనా ఉండేదే. కానీ, ఇటువంటి మహానగరం ఎదుర్కొంటున్న ఇంతటి బృహత్తర సమస్య విషయం లో ముందుగా తగినన్ని జాగ్రత్తలు తీసుకొని కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామా లేదా అనేది ప్రశ్న. అటువంటి ప్రణాళికాబద్ధత లేనట్లయితే దానికి అరాచక లక్షణాలు వస్తాయి.

హైడ్రాకు సంబంధించి గత కొద్ది వారాల మాటలను, చేతలను కూడా గమనించినపుడు దురదృష్టవశాత్తు కలుగుతున్న అభిప్రాయం అటువంటిదేమీ జరగలేదని. ఎటువంటి ముందస్తు మేథోమథనం జరగలేదని. అంతా హడావుడి, అట్టహాసం, సంచలనం. ఒకవైపు క్షేత్రస్థాయిలో కనిపించేది ఇది కాగా, మరొకవైపు పరిపాలనాపరమైన స్థాయిలో కనిపిస్తున్నది అస్పష్టతలు, అయోమయాలు, ప్రశ్నలకు జవాబులేని తనాలు. బయటనే కాదు, కోర్టుల ముందు కూడా. ఇవన్నీ చాలవన్నట్లు ద్వంద్వ ప్రమాణాలు. హైడ్రా దారి హైడ్రాది కాగా, జీహెచ్‌ఎంసీ నుంచి మున్సిపాలిటీల వరకు వాటి తీరు వాటిది. తమ విషయం చెప్పుకునేందుకు పెద్దవాళ్లకు ఏవో, ఎవరో కనిపిస్తుండగా, అర్ధరాత్రి ఇళ్ల పైకి జేసీబీలు దూసుకొస్తున్న సామాన్యులకు, పేదలకు, వికలాంగులకు తమ గోడు ఎక్కడ చెప్పుకోవాలో తెలియని స్థితి.

ఒక ఉద్దేశం నిజంగా మంచిది అయి, పద్ధతి ప్రకారం ఆచరణ ఉన్నట్టయితే ఇటువంటి గందరగోళ పరిస్థితులు తలెత్తుతాయా? ఈ తరహా పరిస్థితులు తలెత్తగూడదని, అందుకు ప్రణాళిక సవ్యంగా ఉండాలనేది ప్రభుత్వానికి తెలియని విషయమా? ఇటువంటి కార్యక్రమాల విషయంలో ముందుగానే చేయవలసిందేమిటి? ఓఆర్ఆర్ పరిధిలో గల చెరువులు, సరస్సులు ఏమిటి? వాటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ఏమిటి? వాటిని తుది రూపంలో ఎప్పుడు నోటిఫై చేశారు? వాటి హద్దులను గుర్తించే రాళ్లు, కంచెలు నేలపై ఉన్నాయా? ఉంటే ఎక్కడ? వీటన్నింటి మ్యాపులు, ఉపగ్రహ చిత్రాల కాపీలు ఉన్నాయా? వీటిలో ఎక్కడెక్కడ ఏ మేరకు ఆక్రమణలు జరిగాయి? ఎపుడు జరిగాయి? అందుకు వ్యక్తులు గాని, అధికారులు గాని ఎవరెవరు బాధ్యులు? ఆక్రమిత స్థలాలలో ప్రస్తుతం ఏమున్నాయి? నిర్మాణాలుంటే వాటికి అనుమతులివ్వటం, కరెంట్, నీళ్లు, డోర్ నంబర్లు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ వంటి వసతుల కల్పన ఎట్లా జరిగింది? అందుకు ఫీజుల వసూలు ఎట్లా చేస్తున్నారు? మొదలైన వివరాలన్నీ ముందుగానే పూర్తిగా సేకరించాలి. పూర్తి పారదర్శకత ఉండాలి. ఎవరైనా సమాచార హక్కు కింద అడిగితే వివరాలిచ్చే ప్రజాస్వామికత కూడా ఉండాలి.

చర్యల దశ ఆ తర్వాత వస్తుంది. ముందుగా ఉల్లంఘనదారులకు నోటీసులివ్వాలి. అదే సమయంలో దోషులైన అధికారులకు, బిల్డర్లకు, ఇతర కాంట్రాక్టర్లకు కూడా నోటీసులివ్వాలి. చెరువులు, సరస్సుల విషయంలో అనుసరించే ఈ క్రమాన్ని నాలాలు, పార్కుల విషయంలోనూ అనుసరించాలి. ప్రభుత్వాలే ఏవో పథకాల కింద పట్టాలు ఇచ్చిన సందర్భాలలో, అధికారుల అనుమతితో ఉల్లంఘనలు జరిగిన సందర్భాలలో, ముఖ్యంగా అది కొన్నేండ్ల కాలంగా ఉన్నపుడు, ఇంత కాలం ఫీజులు సైతం వసూలు చేస్తున్నందున, ప్రభుత్వం తరపున 'పాప పరిహారం' అనుకుని, సదరు వ్యక్తులు అక్కడి నుంచి ఖాళీ చేసేందుకు తగిన సమయం ఇవ్వాలి.

ప్రభుత్వ దోషాలను అంగీకరిస్తూ వారికి నష్ట పరిహారమిచ్చి తర్వాత బిల్డర్లు, కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేసుకోవాలి. బాధితులు పేదవారైతే వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలం చూపాలి. మరీ పేదలైతే ఇళ్లు కట్టివ్వాలి. ముఖ్యమంత్రి పేర్కొన్న అయిదు ఉల్లంఘనలలో ప్రస్తుతం మొదటి మూడింటిపై దృష్టిపెడుతున్నట్లు ఆయనే ప్రకటించినందున, మనం కూడా ప్రస్తుతం అందుకు పరిమితమై ఇదంతా చెప్పుకుంటున్నాము.

కానీ వాస్తవంగా జరుగుతున్నదేమిటి? ఇక్కడే వస్తున్నది అసలు సమస్య. ఇంతవరకు మన దృష్టికి వచ్చినవి ఈ కింది విధంగా ఉన్నాయి. ఓఆర్ఆర్ పరిధిలో గల చెరువులు, సరస్సులు, నాలాలు, పార్కుల జాబితాలైతే ఉన్నాయి. కానీ అన్నింటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల చిత్రాలు, హద్దురాళ్లు, పార్కుల ప్రహరీలకు సంబంధించిన సమగ్ర సమాచారం లేనే లేదు. చర్యలు మొదలైన తర్వాత ఇపుడు సేకరిస్తున్నారు. ఉల్లంఘనలు చేసినవారి సమాచారం లేదు. ఈ సర్వేలు ఇపుడు జరుపుతున్నారు. రికార్డులు ఇపుడు చూస్తున్నారు. వారికి అనుమతులిచ్చినవారు, ఫీజులు వసూలు చేసినవారి గురించి తెలిసింది సముద్రంలో నీటిబొట్టంత. ఎవరు నిర్మాణాలు చేసి అమ్మారో, ఎవరు కొనుగోలుదారులో, జరిగిన మారుబేరాలు ఏమిటో తెలియదు. పేదలకు పట్టాలు ఇచ్చింది ఏ ప్రభుత్వాల్లో, ఎంతకాలం క్రితమో, తిరిగి అవి ఏమైనా చేతులు మారాయో, కుటుంబసభ్యుల మధ్య పంపకాలు జరిగాయో అసలేమీ తెలిసినట్లు లేదు. వారిని అడగటం, షోకాజ్ నోటీసులివ్వటం, చట్టపరమైన విషయాల విచారణ ఏమీ లేదు. అనగా, అసలు రెగ్యులర్ పరిపాలన అన్నది ఇంత అధ్వాన్నంగా సాగుతున్నదన్న మాట. అందుకు నగర పర్యావరణం, ప్రజలు ఇంతకాలం ఒక విధంగా బలి కాగా, ఇపుడు మరొకవిధంగా బలి కావాలా?

ఇది ఒకటైతే, ఉల్లంఘనదారులకు ముందుగా నోటీసులిచ్చి, వారి వివరణ చూసిన తర్వాత చర్యలు తీసుకోవాలి. ప్రస్తుత సందర్భంలోనూ హైకోర్టు మొదటిరోజునే ఆ మాట చెప్పింది. కానీ, అధికారులు సంచలనం కోసమా అనిపించేట్లు ఇదేమీ లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని సందర్భాలలో కేవలం ఒకటిరెండు గంటల నోటీసుతో. అది కూడా అర్ధరాత్రి. అదికూడా పేదలపై. కోర్టులు స్వయంగా జోక్యం చేసుకొని, ముందుగా నోటీసులు ఇచ్చారా అని ప్రశ్నించి, ఇవ్వకుండా ఎట్లా చర్యలు తీసుకుంటారని నిలదీసి, కూల్చివేత నోటీసులను తామే షోకాజ్ నోటీసులుగా మార్చితే తప్ప పరిస్థితి దారికి రాలేదు.

అపుడు గాని అధికారుల అనాలోచితమైన దూకుడుతనం మనకు తెలియలేదు. ఇందులో మరికొన్ని విచిత్రాలున్నాయి. పైన చెప్పుకున్న తరహా సమాచారాలను ప్రభుత్వం సేకరించిందా అన్న ప్రశ్నకు, ఆ పని ఇప్పుడు చేస్తున్నామంటున్నారు. నోటీసులు ఇచ్చారా అంటే, ఒకసారి ఇకనుంచి ఇస్తామని, మరొకసారి ఏదో తీర్పు ప్రకారం అట్లా ఇవ్వనక్కరలేదని చెప్పున్నారు. మరోసారి అయితే, ఉల్లంఘనదారులు కోర్టు నుంచి స్టే తెచ్చేలోగానే కూలుస్తామని ప్రకటిస్తున్నారు. ఒక చట్టబద్ధ వ్యవస్థలో కోర్టు నుంచి రక్షణ పొందటం పౌరుల హక్కని వారికి తెలియదా? వారట్లా మాట్లాడవచ్చునా? అది చట్టాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధిక్కరించడం కాదా? ఇట్లా చెప్పుకునేందుకు ఇంకా ఉన్నాయి. కానీ, ఇంతవరకు గమనించినా, ప్రభుత్వ కార్య ప్రణాళికను లోపభూయిష్ఠంగా హడావుడిగా కాకుండా, సక్రమంగా రూపొందించి అమలుపరచవలసిన అవసరం మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నది. లేనట్లయితే, పైకి చెప్పున్నది ఒకటి కాగా మరేవో ఉద్దేశాలతో ఈ పనిచేస్తున్నారనే అనుమానాలు బలపడతాయి. అటువంటి అనుమానాలు ఇప్పటికే మొదలయ్యాయి కూడా.

పోతే, ఇందులో గమనించవలసినవి మరికొన్ని ఉన్నాయి. ఉల్లంఘనలను గుర్తించేందుకు ప్రభుత్వం సాధారణంగా కటాఫ్ తేదీని నిర్ణయిస్తుంది. అనగా ఎంతకాలం వెనుకకుపోయి ఇందుకు ఒక గడువును తీసుకుంటారన్నది. నగరంలో చెరువులు, సరస్సులు, నాలాలు నిజాం కాలం నుంచి ఉన్నాయి. వేటి ఉల్లంఘనలు ఎప్పటినుంచి జరుగుతున్నాయో ఉపగ్రహ చిత్రాలలో తేలుతుందేమో తెలియదు. ఉపగ్రహాలు వాడుకలోకి రానప్పటి సంగతేమిటో తెలియదు. మ్యాపులు ఏమున్నాయో తెలియదు. మొత్తానికి అట్లా ఎంత వెనుకకుపోతారు? నిజాం కాలమా? ఉమ్మడి ఆంధ్రప్రదేశా? తెలంగాణ రాష్ట్రమా? ప్రభుత్వం ఇంతవరకు ఏమీ ప్రకటించలేదు. ఇదొక ముఖ్యమైన సమస్య కాగా, కూల్చివేతలకు గురయ్యే నిర్మాణాలలో వేర్వేరు రకరకాలవి ఉంటాయి. ఒకటి, ఉన్నతవర్గాల నివాసాలు. రెండు, మధ్యతరగతి వారి నివాసాలు. మూడు, దిగువ మధ్యతరగతి నివాసాలు. నాలుగు, పేదల నివాసాలు. అయిదు, వ్యాపార సంబంధమైనవి. ఆరు, విద్యాసంస్థలు, వైద్య సంస్థల వంటి ప్రజోపయోగ సంస్థలు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో కొన్ని ప్రభుత్వ నిర్మాణాలు కూడా వస్తాయనే అంచనాలు ఉన్నందున అవి ఏడవ కేటగిరీ అవుతాయి. వీటన్నింటిని గురించి ప్రభుత్వం ఆలోచించిందా లేదా తెలియదు. ఒకవేళ ఆలోచిస్తే ఆ విషయాలు రహస్యంగా ఉంచటం గాక ప్రజలకు పారదర్శకంగా తెలియజేయాలి. ఒకవేళ ఆలోచించి ఉండకపోతే ఆ మాట ఇప్పటికైనా బయటకు ఒప్పుకొని, ఇక నుంచి ఆ పని చేస్తామనాలి.

ఇది చాలా సీరియస్ విషయం అయినందున ప్రభుత్వం మరొక పని చేయటం కూడా అవసరం. మొత్తం చెరువులు, సరస్సులు, నాలాల ఎఫ్‌టీఎల్ ప్రాంతాలు, బఫర్‌జోన్ ప్రాంతాలు అన్నింటిలోని అన్ని ఆక్రమణలు కలిపి ఎన్నో, అవి ఏ తరహావో పూర్తి లెక్కలు తీసి ప్రకటించాలి. వాటిని వేలకు వేలుగా కూల్చివేయటం వల్ల కలిగే ఆర్థిక నష్టం ఎన్ని లక్షల కోట్లలో ఉంటుందో అంచనా వేయాలి. నష్టం ఏ వర్గానికి ఎంత, ప్రభుత్వానికి ఎంత అనేది లెక్కల విశ్లేషణలో తేలుతుంది. నష్టం ప్రజలది అయినా, ప్రభుత్వానిదైనా అంతిమ విశ్లేషణలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థది అవుతుందని గుర్తించాలి. ఇవి నష్టం లెక్కలు కాగా, తర్వాత పునర్నిర్మాణాలు ఏ విధంగా? ఎవరెక్కడ? సంస్థల మాటేమిటి? అందుకు నగరంలో గాని, మరొక చోట గాని ఏ విధంగా? ప్రభుత్వం ఒక ప్రభుత్వంగా ఏమైనా ఆలోచించి ప్రణాళికలేమైనా వేస్తుందా, లేక తన బాధ్యతేమీ లేదు, ఎవరిష్టం వారిదంటుందా? ఒక ప్రభుత్వం ఒకవేళ అట్లా చేతులు ఎత్తి వేస్తే, అది బాధ్యతాయుతమైన వ్యవహరణ కాగలదా? లేక వారందరిని ముఖ్యమంత్రి పెట్ ప్రాజెక్ట్ అయిన ఓఆర్ఆర్ – ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతానికి, ఫోర్త్ సిటీకి తరలిపోక తప్పని పరిస్థితిని సృష్టించే ఆలోచన ఉందా? అన్నవి కొన్ని సందేహాలు.

ఉరుము లేని పిడుగు వలె, అకస్మాత్తుగా, అస్తవ్యస్తమైన రీతిలో, ఒక ప్రణాళికాబద్ధత లేని రీతిలో తెరపైకి వచ్చి, లేడికి లేచిందే పరుగన్న రీతిలో సాగుతున్న ఈ కూల్చివేతల పథకం రహస్యోద్దేశం అదే కాదు గదా అన్నది మరొక సందేహం. ఒకవేళ అట్లా వీరంతా తరలిపోవాలన్నదే ఆలోచన అయితే అది జరిగేందుకు ఎంతకాలం పడుతుంది? అదొక కొత్త నగర నిర్మాణం వంటిది గదా.

పోతే, ఈ క్రమం అంతటిలో వివిధ వర్గాల ప్రజలపై, వ్యాపారాలపై, వ్యవస్థలపై, అంతిమ విశ్లేషణలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పడగల ప్రభావాల గురించి, అదేవిధంగా ఈ అస్తవ్యస్తతల వల్ల ఏర్పడగల అస్థిరతలతో ఒకవేళ ఏవైనా ఒడిదుడుకులు, రాష్ట్ర ప్రతిష్ఠ పట్ల బయటివారికి సందేహాలు కలిగే అవకాశం ఉంటే అవీ, వీటన్నింటి గురించి కూడా ప్రభుత్వం ఆలోచించటం అవసరం. అటువంటి మేధోమథనాలు ఇప్పటికే ఏమైనా చేశారేమో తెలియదు. పని జరుగుతున్న తీరుతెన్నులను చూడగా, అటువంటిదేమీ జరిగినట్లు మాత్రం కన్పించటం లేదు.

ఓపీఎస్ విధానమేది?

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన 9 నెలల పాలనలో రైతులను, మహిళలను, యువతను దారుణంగా వంచించారు. ఇస్తామన్నవి ఇవ్వలేదు సరికదా కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నో మంచి మంచి పథకాలకు మంగళం పాడేశారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్ల వంతు వచ్చింది. వీరిని కూడా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వంచించబోతుందా? కేంద్రానికి దాసోహం అంటుందా? అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను గంగలో కలపనుందా? అనే సందేహాలకు అవుననే సమాధానాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 1న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు ఏకంగా 'పింఛన్ విద్రోహ దినం' పాటించారు.

డాక్టర్ అయాచితం శ్రీధర్
98498 93238

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులకు, పింఛనర్లకు సంబంధించి.. పాత పింఛన్ విధానాన్ని అమలుపరుస్తామని, ఏకీకృత, జాతీయ పింఛన్ విధానాలను అమలుపరచబోమని పెండింగ్‌లో ఉన్న మూడు డీఎలను వెనువెంటనే చెల్లిస్తామని, ప్రభుత్వం ఏర్పాటైన ఆరు నెలల్లోపే పీఆర్సీ ఆమోదించి అమలు పరుస్తామని పేర్కొన్నది. ఇవన్నీ నిజమని నమ్మారు ఉద్యోగులు. కానీ ఈ తొమ్మిది నెలల కాలంలో (మొదటివారంలో జీతాలు, పింఛన్లు తప్ప) ప్రభుత్వ ఉద్యోగులకు, పింఛనర్లకు సంబంధించిన ఇతర ప్రధాన హామీలేవీ అమలు కాలేదు సరికదా ఈ 9 నెలల కాలంలో ముఖ్యమంత్రి గాని, ఇతర మంత్రులు గాని ఆ ఊసే ఎత్తడం మానేశారు. ఇటీవల ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించిన ముఖ్యమంత్రి ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు అన్నారే తప్ప పాత పింఛన్ విధానాన్ని మాత్రమే అమలుపరిచి తీరుతానని ఒక్క మాట అనలేదు. విశేషమేమిటంటే ఎన్నికల సందర్భంగా రాహుల్‌గాంధీ నోటి నుంచి కూడా పాత పింఛన్ హామీ వెలువడ లేదు. పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న డీఏలు, పాత పింఛన్ వంటి ప్రధానమైన అంశాల్లో ముఖ్యమంత్రి ఇప్పటివరకు ఒక సమీక్ష జరిపిన దాఖలాలు కనిపించలేదు. ముఖ్యమంత్రి సర్వస్వతంత్రుడని, తమ సమస్యలు చిటికలో పరిష్కారమవుతాయని ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు పెట్టుకున్న గంపెడాశలు నానాటికి అడుగంటుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వం ఏర్పడిన 9 నెలలకే ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు వీధుల్లోకి రావాల్సిన దుస్థితి ఏర్పడింది.

పీఆర్సీ, డీఏ బకాయిల విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు దశాబ్దాలుగా సర్దుబాటు ధోరణి ప్రదర్శిస్తున్నారు. కొంత అటూ ఇటు అయినా భరిస్తూ వస్తున్నారు. కానీ, అలవికాని అలసత్వం ప్రభుత్వ యంత్రాంగ సంక్షోభానికి కారణమవుతున్నది. పులి మీద పుట్రలా కేంద్రం ఇటీవల ఆమోదించిన 'యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్' ప్రభుత్వ ఉద్యోగుల, పింఛనర్ల పాలిట అశనిపాతంగా మారింది. ఆ గండం నుంచి గట్టెక్కడానికి వారంతా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైపు ఆశగా చూస్తున్నారు.

2004 జనవరి 1న జాతీయ పింఛన్ విధానాన్ని నాటి ప్రధాని వాజపేయి ప్రవేశపెట్టగా ఆరు నెలల తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మన్మోహన్ సింగ్ ప్రభుత్వం దానిని తోసిపుచ్చలేదు, సరికదా పకడ్బందీ విధి విధానాలను రూపొందించింది. 2013లో పీఎఫ్‌ఆర్‌డీఏ చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించింది. ఇటీవల ప్రధాని మోదీ క్యాబినెట్ కొత్త సీసాలో పాత సారా పోసినట్టు వాజపేయి జాతీయ పింఛన్ విధానానికి బదులుగా ఏకీకృత పింఛన్ విధానాన్ని ఆమోదించింది. ఇదొక అద్భుతమైన పింఛన్ విధానమని ప్రకటించింది. కానీ, కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లయింది. ఈ తలతిక్క విధానాల ఫలితంగా గత 20 ఏండ్లుగా పింఛనర్లు తమ బతుకు భరోసా అయిన న్యాయమైన పింఛన్‌ను పొందలేని దుస్థితిలో కునారిల్లుతున్నారు. 2004 కంటే ముందు నియమితులైన ప్రభుత్వ ఉద్యోగులు రిటైరైన తర్వాత దర్జాగా న్యాయమైన, హక్కుగా సంక్రమించిన పింఛన్ అనుభవిస్తుంటే, ఈ 20 ఏండ్ల కాలంలో నియమితులైన వారు పాత పింఛన్ విధానం అమలుకోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. కొత్త పింఛన్ విధానాల్లో ఉన్నదేమిటంటే... ఉద్యోగి 10 శాతం వేతనం కంట్రిబ్యూట్ చేస్తే ప్రభుత్వాలు అంతకంటే కొంత ఎక్కువ 18 శాతం వరకు మ్యాచింగ్ చేసి ఉద్యోగి రిటైరయ్యే సమయంలో ఇస్తాయట. ఈ లోగా సదరు రొక్కాన్ని ఎక్కడో షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టి వచ్చిన లాభాలను రిటైరైనప్పుడు ఇస్తాయట. అంటే కేంద్రం ఒకరకంగా ఉద్యోగుల శేష జీవితాలను పణంగా పెట్టి జూదం ఆడాలనుకుంటున్నది. ఇదెక్కడి సంక్షేమ రాజ్యం? తక్కువ సర్వీస్ ఉన్న ఉద్యోగి రిటైరైతే ఈ విధానం వల్ల నష్టపోయేది ఎంత? ప్రపంచ బ్యాంక్ విధానాలకు అనుకూలంగా కేంద్రం ఆమోదించిన ఈ కొత్త పింఛన్ విధానం పద్మవ్యూహంలోకి పింఛనర్లు వెళ్తే తిరిగి రాగలరా? పాత పింఛన్ విధానం కంటే కొత్త ఏకీకృత పింఛన్ లాభదాయకంగా ఉంటే ఉద్యోగులు ముక్తకంఠంతో వ్యతిరేకించరు కదా! ఇంటికి ధనలక్ష్మి వస్తుందంటే తలుపులు మూసుకోరు కదా!

ఇప్పటికే పశ్చిమబెంగాల్, కేరళ, పంజాబ్, రాజస్థాన్ సహా కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రా లు కొత్త పింఛన్ విధానాన్ని పక్కనపెట్టాయి. దక్షిణాదిన అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నాయి. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఈ బాధ్యత మరింత ఉన్నది. ఎందుకంటే, గత ఎన్నికల మ్యానిఫెస్టోలో వారు పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని స్పష్టంగా పేర్కొన్నారు కాబట్టి. ఈ సందర్భంగా చాలామంది ప్రభుత్వ ఉద్యోగ మిత్రులు, తోటి పింఛనర్లు అంతర్గత చర్చల్లో... వ్యవసాయ మోటార్లకు మీటర్ల విషయంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఏకంగా ప్రధాని మోదీని ఢీకొని, కేంద్రం నిధులు ఇవ్వనని బెదిరించినా ధర్నాకు దిగి 'చావనైనా చస్తాను గానీ వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించను' అని నినదించిన సందర్భం గుర్తుచేసుకుంటున్నారు. ఆ స్థాయిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోట పాత పింఛన్ ఇస్తాననే నొక్కి వక్కాణింపు కోసం కొత్త పింఛన్ బాధితులు ఎదురుచూస్తున్నారు. అసలు ముఖ్యమంత్రి బడేభాయ్ మాటను కాదనే సాహసం చేస్తారా? అన్న సందేహం కొందరిని పీడిస్తున్నది. అందుకు మరో కారణం కూడా ఉన్నది. ఏపీ సీఎం నోటివెంట ఇంకా పాత పింఛన్ ఇస్తానన్న మాట రాలేదు మరి. కేసీఆర్ హయాంలో 95 శాతం లోకల్ రిజర్వేషన్, 43 శాతం ఫిట్‌మెంట్, తెలంగాణ ఇంక్రిమెంట్, ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు ప్రభుత్వంలో గౌరవప్రదమైన పదవులు, వివిధ విభాగాల్లో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడం, వంటి చరిత్రాత్మకమైన ఉద్యోగ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలయ్యాయని చెప్పుకోవడానికి ఉన్నాయి. ఈ తొమ్మిది నెలల్లో అలాంటి చారిత్రక సందర్భాలు ఏవీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తారసపడలేదు. (చెప్పుకుంటున్న ఆరు నెలల్లో 30 వేల ఉద్యోగాలు కూ డా కేసీఆర్ ప్రభుత్వం వల్లనేనని అందరికీ తెలిసిందే). ఇప్పుడు సమయం ఆసన్నమైంది. గత ప్రభుత్వం కంటే ఒక చేయి పైన ఉండేట్లుగా ఫిట్‌మెంట్, పాత పింఛన్ విధానం అమలు, డీఏ బకాయిల చెల్లింపు అంశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించాలని ఉద్యోగులు, పింఛనర్లు ఆశిస్తున్నారు. సమస్యలు పాలకుల ముందుకొచ్చినప్పుడల్లా గతం మీద తోసేయడం, సంచలనాలు సృష్టించి దృష్టి మళ్లించడం, దరిద్ర దేవత దండకాలు వినిపించడం ఇంకానా... ఇకపై చెల్లవు.